ఉపాధి కోసం వెతుకులాట..

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన సింగరేణి సంస్థకు జన్మనిచ్చిన నేల ఇది. ఒకప్పుడు దేశంలో నలుమూలల నుంచి బతుకు దెరువు కోసం ఇల్లెందుకు వలస వచ్చేవారు. ప్రస్తుతం ఇల్లెందు, పరిసర గ్రామాలలో నివసిస్తున్న వారిలో అత్యధికులు అలా వచ్చిన వలస జీవులే. కానీ నేడు అందుకు భిన్నంగా ఉంది ఇల్లెందు పరిస్థితి. పొట్టకూటి కోసం కొంతమంది, కుటుంబ పోషణ కోసం మరికొంత మంది ఉపాధి వేట కొనసాగిస్తున్నారు. వారి ఉపాధికి ఒకవైపు యంత్రాలు మరోవైపు వలస కూలీలు భారంగా మారుతున్నారు.

- మిర్చి ఏరివేత పనుల్లో ఒడిశా కూలీలు
- వరి నాటు, కోత పనుల్లో యంత్రాలు
- ఉపాధి కోసం దూరప్రాంతాలకు స్థానికుల ప్రయాణం





కూలి పనులకు ఆటోలో దూరప్రాంతాలకు వెళ్తున్న స్థానిక కూలీలు

ఇల్లెందురూరల్: నిరుద్యోగులైన యువతకు నైపుణ్యం జోడించి స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరిచే ప్రక్రియ ఇల్లెందు, పరిసర గ్రామాలలో మాటలకే పరిమితమైంది. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన యువజన శిక్షణ కేంద్రం ఉత్సవ భవనంగా మారిపోయింది. ఫలితంగా యువత వ్యవసాయ, భవన నిర్మాణ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. మహిళలు అత్యధికంగా వ్యవసాయ పనులకు వెళ్తూ ఎంతో కొంత ఉపాధి పొందుతున్నారు. ఇలా ప్రతీరోజు ఇల్లెందు, పరిసర గ్రామాల నుంచి వెయ్యికి పైగా మహిళలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉపాధి పొందుతున్నారు.

యంత్రాలు, వలస కూలీల బెడద...

ఏటా వానాకాలం సాగు పనుల ప్రారంభం నుంచి వ్యవసాయ పనులతో కూలీలు బిజీగా గడుపుతుంటారు. మొక్కజొన్న, పత్తి విత్తనాలు విత్తుకోవడం, చేలల్లో కలుపు తీయడం, ఆ తరువాత వరినాట్లు, కలుపు తీయడం వంటి పనులతో క్రమం తప్పకుండా ఉపాధి లభించేది. ఇక మిర్చి నారు పోయడం, మొక్కలు నాటడం, కలుపుతీయడం వంటి పనులకు కూడా స్థానిక కూలీలపైనే రైతులు ఆధారపడుతుంటారు. కానీ కొన్నేళ్లుగా వ్యవసాయంలో యంత్రాల వినియోగంతో కొంతమేర కూలీల అవసరం తగ్గింది. అయినా సుదూర ప్రాంతాలకు సైతం రాకపోకలు సాగించి ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇక మిర్చి ఏరివేత సమయంలో కూలీలకు గిరాకీ ఉంటుంది. కానీ యంత్రాలకు తోడుగా ప్రస్తుతం రైతులు మిర్చి ఏరివేత పనులకు ఒడిశా రాష్ట్రం నుంచి కూలీలను తీసుకురావడంతో స్థానిక కూలీల ఉపాధికి కరువు వచ్చింది.

రవాణా చార్జీలు భారమయ్యాయని..

మిర్చి ఏరివేత సమయంలో కూలీల కొరతను అధిగమించేందుకు సమీప పట్టణ ప్రాంతాల నుంచి కూలీలను రప్పించుకోవడం ఏటా చూస్తున్నాం. ఇలా దూరప్రాంతాలకు పరిమితికి మించి ఆటోలలో ప్రయాణం చేస్తూ పలువురు కూలీలు రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతి చెందగా.. మరికొందరు తీవ్రంగా గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినా పొట్ట కూటి కోసం నేటికీ అదే తరహాలో కూలీలు తమ ప్రయాణం కొనసాగిస్తున్నారు. కానీ గడిచిన మూడేళ్లుగా ఆ పనికి రైతులు ఒడిశా నుంచి కూలీలను రప్పించుకోవడం స్థానిక కూలీలకు ఇబ్బందిగా మారింది. స్థానిక కూలీలకు రోజుకు రూ.300 చెల్లిస్తూ వారి ప్రయాణానికి అయ్యే ఖర్చు కూడా రైతులే భరిస్తున్నారు. కానీ ఒడిశా కూలీలకు రోజువారీ కూలీ చెల్లిస్తే సరిపోతుందని రైతులు చెపుతున్నారు. దీనివల్ల పెట్టుబడి భారం కొంతైనా తగ్గుతుందని చెబుతున్నారు.

పనికోసం వెతుకులాట..

ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లలో వ్యవసాయ పనులతో ఉపాధి పొందే పట్టణ, సమీప ప్రాంత కూలీలు వేసవిలో మిర్చి ఏరివేత పనులతో ఉపాధి పొందేవారు. కానీ నేడు యంత్రాలు, ఇతర రాష్ట్రాల కూలీల బెడదతో ఉపాధి పనుల కోసం రోజువారీ వెతుకులాట తప్పడం లేదు. ప్రస్తుతం వారంలో రెండు రోజులు మినహా పనులు దొరకడం లేదని కూలీలు వాపోతున్నారు. దూరప్రాంతమైనా వెళ్లేందుకు సిద్ధమై ముఠా మేస్త్రీలు పనుల కోసం అన్వేషిస్తున్నారు.



కొమరారం ప్రాంతంలో మిర్చి ఏరుతున్న ఒడిశా కూలీలు

గతంలో ప్రతీరోజు కూలి..



మూడేళ్ల క్రితం వరకు ప్రతీరోజు కూలి దొరికేది. స్థానికంగానే ఎక్కువ రోజులు పనులు చేసేవాళ్లం. ఇతర ప్రాంతాల రైతులు పిలిస్తే దూరమైనా వెళ్లి ఉపాధి పొందేవాళ్లం. నేడు వారంలో రెండు రోజులు కూడా పని దొరకడం లేదు.

– కారం ముత్తమ్మ, తిలక్‌నగర్

వలస కూలీల రాకతో..



స్థానికంగా చేసేందుకు పనులు లేవు. అలవాటు లేకున్నా వ్యవసాయ పనులకు వెళ్తున్నాం. వ్యవసాయంలో యంత్రాల తోపాటు ఇతర రాష్ట్రాల కూలీల వినియోగం పెరగడంతో ప్రతీరోజు పని కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– దేవమ్మ, విజయలక్ష్మీనగర్

క్లుప్తంగా

ఉచిత యోగా శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ ప్రగతి వనం పార్క్‌లో ఆధునీకరించిన యోగశాలలో శనివారం నుంచి యోగా శిబిరం ప్రారంభించనున్నామని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల కార్మికులు, కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతవాసులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్మికులు నిత్యం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుందని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

తల్లిదండ్రుల్లా 'సింగరేణి' ఆదరించింది..



జీఎం శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ తల్లిలా లాలించిందని, తండ్రిలా ఆదరించిందని, సంస్థ మరో రెండు వందల సంవత్సరాలు కొనసాగుతూ మరో లక్ష మందికి జీవనోపాధి కల్పించాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కోడూరు శ్రీనివాస్‌రావు అన్నారు. 34 సంవత్సరాలు వివిధ ఏరియాలలో, వివిధ హోదాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాస్‌ను తోటి అధికారులు, ఉద్యోగులు సింగరేణి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీఎం పర్సనల్ కవితానాయుడు, మాజీ జీఎం కట్టా బసవయ్య, డీజీఎం రాజేంద్రప్రసాద్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ..



రమేష్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: పట్టణంలోని 21 ఫిట్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు చిలుకూరి రమేష్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు టీపీటీఎఫ్ నాయకులు శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. వి.మనోహర్‌రాజు, ఎస్.పూర్ణచందర్‌రావు, నాగు, పాషా, జి.హరిలాల్, శ్రీనివాసరావు, స్వామిదాస్, స్వామి, వెంకట్రాం, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

కేటీపీఎస్ సీఈ...



వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ సీఈ పి.వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కర్మాగారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు భారీ ఎత్తున తరలి వచ్చి అభినందించారు. గజమాల, శాలువాతో సన్మానించారు.

ఏసీపీ విష్ణుమూర్తికి పలువురి పరామర్శ

జూలూరుపాడు: హైదరాబాద్ ఏసీపీ, జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంకు చెందిన సబ్బతి విష్ణుమూర్తి తల్లి మంగాయమ్మ (78) మృతి చెందారు. ఆమె హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆమె అంత్యక్రియలు శనివారం వెంకన్నపాలెంలో నిర్వహించనుండగా, విష్ణుమూర్తి, ఆయన సోదరుడు శివమూర్తిని పలువురు పరామర్శించారు.

ఏఎస్‌ఐకు సేవా పతకం



నాగరాజుకు సేవా పతకం అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం ఏఎస్‌ఐ నాగరాజుకు సేవా పతకం, రూ.20 వేల రివార్డును ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం అందజేశారు. విధి నిర్వహణలో ఆయన చూపిన ప్రతిభకు గుర్తింపుగా పోలీసుశాఖ సేవా పతకంతో అభినందించింది. నాగరాజును డీఎస్పీ చంద్రభాను, సబ్‌డివిజన్ పోలీసు అధికారులు అభినందించారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, తదితరులు

ఇల్లెందు: పట్టణంలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఇల్లెందు బ్రాంచి ఆవరణలో మేనేజర్ నర్సింహారావు ఆధ్వర్యంలో హమాలీలు, ఉద్యోగులు శ్రీశ్రీశ్రీ మైసమ్మ తల్లి, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్‌లు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సమ్మె నోటీసు



నోటీసు అందజేస్తున్న ఉపాధి సిబ్బంది

ఇల్లెందురూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ మండలంలోని మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం సిబ్బంది శుక్రవారం మండల పంచాయతీ అధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఏపీఓ శంకర్ మాట్లాడుతూ.. సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా పే స్కేల్ మంజూరు చేయాలని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆయా డిమాండ్ల సాధన లక్ష్యంగా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు.

ప్రగతి చక్ర అవార్డులు అందజేత



ప్రశంసా పత్రాలు అందుకున్న ఆర్టీసీ సిబ్బంది

చుంచుపల్లి: కొత్తగూడెం డిపో పరిధిలో డిసెంబర్ 2024లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లు, మెయింటెనెన్స్ సిబ్బందికి శుక్రవారం కొత్తగూడెం వన్ టౌన్ సీఐ కరుణాకర్, డీఎం దేవేందర్ గౌడ్ చేతుల మీదుగా ప్రగతి చక్ర అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఆర్టీసీ సిబ్బంది సేవలను కొనియాడారు. అనంతరం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రాయింగ్, వ్యాసరచనలో గెలుపొందిన వివేకవర్ధిని స్కూల్, ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీస్ అధికారులకు సన్మానం

కొత్తగూడెంఅర్బన్: పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు ఏఎస్సైలు, ఏఆర్‌ఎస్సైలను శుక్రవారం జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ రోహిత్‌రాజు ఘనంగా సత్కరించారు. ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న సర్వయ్య, మణుగూరు పోలీస్ స్టేషన్ ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న నిజాంఅలీ, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్‌ఎస్సై ఓంప్రకాష్‌మిశ్రా పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ పొందారు. ఈ వారిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన అన్నిరకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. వారు శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, హోంగార్డ్స్ ఆర్ఐ నరసింహారావు, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, ఎంటీఓ సుధాకర్, శ్రీనివాసరావు, ఏసోబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

జూలూరుపాడు: ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జూలూరుపాడులో మీడియాతో మాట్లాడుతూ.. అధ్యాపకులు, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పీఆర్‌టీయూ వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.వెంకటేశ్వరరావు, బి.రవి, సీహెచ్ ప్రభాకర్, సుబ్బారావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జీపీ కార్మికుల సంఘం మహాసభ



మాట్లాడుతున్న గోపాల్‌రావు

పాల్వంచ: ఈ నెల 2వ తేదీన పాల్వంచలో జరగనున్న తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఏదులాపురం గోపాల్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... 2021 పీఆర్‌సీ నివేదిక ప్రకారం అన్నిరంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 30 శాతం ఫిట్‌మెంట్ అమలు కోసం ప్రభుత్వం జీఓ నంబర్ 60 విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న నైపుణ్యం కలిగిన వారికి రూ.24,500, సెమీస్కిల్డ్, అన్ స్కిల్డ్ పారిశుద్ధ్య కార్మికులకు రూ.22,100, రూ.18వేలు వేతనాలను అమలు చేయాలని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులను విస్మరించడంతో బుద్ధి చెప్పారని, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు పని భద్రత కల్పించాలని, న్యాయమైన వేతనాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, ముద్దా భిక్షం, మధుసూదన్‌రెడ్డి, యాకూబ్‌షావలీ పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు, అభిమానులు

కొత్తగూడెంఅర్బన్: 1969 ప్రత్యేక తెలంగాణ సమరయోధుల సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ప్రజాయుద్ధ నౌక, ప్రజాగాయకుడు గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.శాంతిరామ్ మాట్లాడుతూ... గద్దర్ తన పాటలతో, కవిత్వాలతో తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేశారని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశారని, ఆయన లేకపోవడం బాధాకరమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సేవలను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలచెర్వు గెర్షోము, దాచపల్లి వెంకటేశ్వర్లు, రామారావు, జ్ఞానవినోదిని, బలరాంసింగ్, సత్తార్, చాంద్, నజీర్, లక్ష్మమ్మ, రామయ్య, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిక

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో శుక్రవారం చుంచుపల్లి మండలం పెనగడప గ్రామపంచాయతీ వనమానగర్‌కు చెందిన 30 కుటుంబాలు సీపీఐలో చేరాయి. వారికి పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, జి.వీరస్వామి, ఎస్.నాగేశ్వరరావు, నీడల సుధాకర్, మన్నెం వెంకన్న, మల్లేష్, తిరుపతి, మన్నెం భాస్కర్, కట్టా భాస్కర్, కట్టా శంకర్, ఉదయ్, భద్రారావు పాల్గొన్నారు.

టీజీటీటీఎఫ్ కమిటీ ఎన్నిక



పూల్‌సింగ్



రామకిషన్

టేకులపల్లి: తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీజీటీటీఎఫ్) టేకులపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా బి.పూల్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా టి.రామకిషన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, రమేష్ బాబు, బన్సీలాల్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

సుజాతనగర్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. ఆయా విగ్రహాలు, పార్టీల దిమ్మెలకు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రాజకీయ నేతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది లక్ష్మణ్, సత్యం, వీరయ్య, భాస్కర్, కాంతారావు పాల్గొన్నారు.

కార్మికుల తలరాత మారేదెప్పుడు?



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెరగటం లేదని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. శుక్రవారం ఇల్లెందులోని చంద్ర కృష్ణమూర్తి విజ్ఞాన కేంద్రంలో ప్రగతి శీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ 2వ మహాసభ జరిగింది. నర్సయ్య మాట్లాడుతూ... ప్రభుత్వాలు మారినా కార్మికుల వేతనాలు పెంచేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకోవటం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తోందన్నారు. టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం మాట్లాడుతూ... పదేళ్లుగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచలేదన్నారు. అభివృద్ధి పేరిట ఎమ్మెల్యేకు నిధులు అందజేసే సింగరేణి యాజమాన్యం ఉత్పత్తిలో కీలకపాత్ర పోషించే కార్మికులను విస్మరించటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర నాయకులు యాకుబ్‌షావలీ, ప్రధాన కార్యదర్శి తోకల రమేష్, ఆర్.మధుసూదన్‌రెడ్డి, పెద్దబోయిన సతీష్, సీపై పుల్లయ్య, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న, చంద్రశేఖర్, సంజీవ్, కె.రఘు, రాజశేఖర్, శరత్, మల్లెల వెంకటేశ్వర్లు, శేషయ్య, గురునాథం, బాలు, పద్మ, దుర్గ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

బీసీ యుద్ధభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చుంచుపల్లి: కొత్తగూడెం బీసీ కార్యాలయంలో శుక్రవారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ మేరకు ఫిబ్రవరి 2న వరంగల్‌లో జరగనున్న బీసీ రాజకీయ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ నాయకులు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీ నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ రద్దు చేయాలని కోరారు. చేతి కులవృత్తులను పరిశ్రమలుగా గుర్తించి ప్రోత్సహించాలని, బీసీ పేద బిడ్డలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని, దేశవ్యాప్తంగా కుల జనగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లెల రామనాథం, మిట్టపల్లి సాంబయ్య, అంకినీడు ప్రసాద్, కనుకుంట్ల కుమార్, కురిమెళ్ల శంకర్, కాసోజు రామాచారి, భిక్షపతి, బొడ్డుపెల్లి సత్యనారాయణ, శ్రీనివాస నాయుడు, మెట్టల సైదిబాబు, కుడికాల సమ్మయ్య, రియాజ్ అహ్మద్, వేణు, మహేష్ గౌడ్, కమలారాణి, జయమ్మ, మునీల తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి ఖర్చులకు వెల్ఫేర్ బోర్డు సాయం

ఇల్లెందు: పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును అసంఘటితరంగ కార్మికులు ఉపయోగించుకోవటం లేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి తాళ్లూరి కృష్ణ అన్నారు. శుక్రవారం భవన నిర్మాణరంగ కార్మికుల అడ్డా మీద సీఐటీయూ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లల పెళ్లికి వెల్ఫేర్ బోర్డు సహాయం అందుతుందని, బీమా సదుపాయం ఉందన్నారు. ఫిబ్రవరి 4న సుతారి కార్మికులు అడ్డా మీద వెల్ఫేర్ ఆఫీసర్‌తో సమావేశం ఏర్పాటు చేసుకుని సభ్యత్వం స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామ నాగరాజు, సత్యనారాయణ, కోరీ, భద్రు, శ్రీను, రమేష్, కుమార్, మహమూద్, లక్ష్మణ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీ వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



పాల్వంచ: అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



జూలూరుపాడు: వాసవీమాతకు హారతి ఇస్తున్న భక్తులు

పాల్వంచ: ఆర్యవైశ్యుల కులదైవం శ్రీవాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి సేవాదళ్ సభ్యులు పల్లకీలో అమ్మవారిని పాటలు, కీర్తనలతో నటరాజ్ సెంటర్ నుంచి ఊరేగింపుగా లలిత కామేశ్వరి గుడి వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు చైతన్య శర్మ మాట్లాడుతూ... ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ అమ్మవారు ఆత్మగౌరవానికి ప్రతీకగా ఆది పరాశక్తిగా అవతరించి హోమగుండంలో ఆత్మార్పణం చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చలవాది ప్రకాష్, పెండ్యాల రోజాలక్ష్మి, దారా నరసింహారావు, సంక సర్వేష్, సంక రమ, దుర్గ, శ్రీలక్ష్మి, దేవీప్రసాద్, కొప్పరపు రాము, పెండ్యాల సతీష్, బచ్చు శ్రీనివాస్, సురేష్, పద్మ, వెంకటేశ్వరరావు, అరవింద్, ప్రదీప్, ఇందిరా, సౌజన్య, దీప్తి పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీమాతకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 50 రకాల నైవేద్యాన్ని సమర్పించారు. ఆర్యవైశ్యులతోపాటు, ప్రజలంతా చల్లంగా ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని, వ్యాపార, వాణిజ్య రంగాలు అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో తొండెపు నాగమణి, తొండెపు సరిత, పెండ్యాల నదియా, భానుమతి, సీమకుర్తి చిట్టెమ్మ, కంచర్ల రమాదేవి, పెండ్యాల ఝాన్సీ, చిట్లూరి పద్మ, వందనపు నాగమణి, కొడుమూరి అంజలి, నాగలక్ష్మి, రామలక్ష్మి, శిరీష, అంజలి, సంధ్య, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకుబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148